అధ్వానంగా భైంసా బస్టాండ్..!

- దుర్గంధమయంగా పరిసరాలు
- అస్తవ్యస్త పార్కింగ్‌తో ప్రయాణికులకు తిప్పలు
- నిర్వహణను గాలికొదిలేసిన ఆర్టీసీ అధికారులు


చెత్తాచెదారంతో బస్టాండ్ వెనుక పరిసరాలు

భైంసాటౌన్: డివిజన్ కేంద్రమైన భైంసా బస్టాండ్ ఆవరణలో పారిశుధ్యం లోపిస్తోంది. పరిసరాలు అధ్వానంగా మారడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. తరచూ సెప్టిక్ ట్యాంక్ పైపులు పగిలిపోయి వ్యర్థాలతో పరిసరాలు కంపు కొడుతున్నాయి.

ఆహ్లాదం కరువు...

బస్టాండ్ ఆవరణలో ప్రహరీని అనుకుని గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. అప్పటి డిపో మేనేజర్ బహిరంగ మూత్ర విసర్జన జరుగకుండా చర్యలు తీసుకోవడంతో పరిసరాలు శుభ్రంగా ఉండేవి. కాగా, కొన్నేళ్లుగా బస్టాండ్‌లో పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేశారు. కొందరు ఇష్టారీతిన బస్టాండ్ ఆవరణలో బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు. బయటి దుకాణాల నిర్వాహకులు బస్టాండ్ వెనుక ఆవరణలో చెత్తాచెదారం పడేస్తున్నారు. దీంతో పరిసరాలు అధ్వానంగా మారాయి.


రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ నీరు

పార్కింగ్ తిప్పలు...

బస్టాండ్ ఆవరణలో ఇష్టారాజ్యంగా స్టాళ్ల ఏర్పాటుతో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది అవుతోంది. ఖాళీ ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నవారు పరిధి దాటి ముందుకు వచ్చి సామగ్రి బయట పెడుతుండడటంతో బస్టాండ్‌కు వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వాహనదారులు పార్కింగ్‌కు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌లోకి వెళ్లే ప్రవేశమార్గంలోనే వాహనాలు నిలుపుతుండటంతో మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి అస్తవ్యస్త పార్కింగ్, పరిసరాల పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఇష్టారీతిన వాహనాల పార్కింగ్

‘సిట్‌తో విచారణ జరిపించాలి’

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రవ్యాప్తంగా హిందూ ఆలయాలు, పండగలపై జరిగిన దాడులపై సిట్‌తో విచారణ జరిపించి దోషులను శిక్షించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్ అన్నారు. ఇటీవల హైదరాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయాల నడుమ పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూర్తి ప్రభాకర్, నాయకులు పతికే రాజేందర్, చింతకుంట శ్రీనివాస్, సిద్ధ శ్రీవాణి, ద్యాగరిసరి, సమ్మెట సురేశ్, ముప్పిడి రవి, నరేందర్, నరేశ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: హిందూ ఆలయాలు, పండుగలపై దాడులు అరికట్టాలని కోరుతూ భజరంగ్‌దళ్ నాయకులు శనివారం తన కార్యాలయంలో తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. గణపురం రాజేశ్వర్, శ్రీవాణి, కాశవేని ప్రణయ్, దర్శనాల రాకేశ్, మంత్రరాజం సురేశ్, జెట్టి వెంకటేశ్, జోగు రాజేశ్వర్, తాళ్ల భూమేశ్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.


నిర్మల్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలి

తానూరు: విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని ఎంఈవో నరేందర్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పోషకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థులను చదవించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు భూమన్నయాదవ్, సుదర్శన్, శంకర్, హరీశ్, మాధవ్‌రావ్, సుజాత దేవి, రజనీకాంత్, రవీందర్, పోషకులు ఉన్నారు.

దస్తురాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరం కృషి చేద్దామని మండల విద్యాధికారి గంగాధర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట వేణు, ఉపాధ్యాయులు కొమురయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


ఎల్విలో మాట్లాడుతున్న ఎంఈవో నరేందర్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కడెం: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ అన్నారు. శనివారం మండలంలోని అంబారిపేట్, కొలాంగూడ, చిన్నబెల్లాల్, పెద్దబెల్లాల్, గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సీ,ఎస్టీటీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉన్నత చదువుల కోసం 1977లో జీవో నం 342ను తీసుకొచ్చిందన్నారు. కానీ రాష్ట్రంలోని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఉద్దేశపూర్వకంగా జీవోకు వక్రభాష్యం చెప్పడంతో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆరోపించారు. ఇందులో ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఓంసాయి, తదితరులున్నారు.

దస్తురాబాద్: ఉపాధ్యాయులు ఉన్నత చదువుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోకు రాష్ట్రంలోని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఉద్దేశపూర్వకంగా వక్రభాష్యం చెప్పడం విడ్డూరంగా ఉందని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేశ్‌నాయక్ ఆరోపించారు. శనివారం మండలంలోని ఆయా పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘంలో నూతన ఉపాధ్యాయులను చేర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, మండలాధ్యక్షుడు వెంకటరాజం, ఉపాధ్యాయులు సుగుణాకర్, మల్లేశ్, నాగరాజు, భూమయ్య పాల్గొన్నారు.


కడెం: చిన్నబెల్లాల్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసాటౌన్: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని నర్సింహ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే పట్టణంతోపాటు మండలంలోని 297 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బి.గంగాధర్, కౌన్సిలర్లు ఫైజుల్లాఖాన్, అమీర్ అహ్మద్, గౌతం పింగ్లే, బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు భీంరావ్, రమేశ్, పోశెట్టి తదితరులున్నారు.

కష్టసుఖాల్లో అండగా ఉంటా..

కుభీర్: ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటానని.. ఏ కష్టమొచ్చినా తనను సంప్రదించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 120 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తులంబంగారం హామీ అమలు చేయాలని అసెంబ్లీలో లేవనెత్తుతానన్నారు. మండలంలోని జామ్‌గాం నుంచి భైంసాకు గురుకులం తరలించారని.. భవనం కేటాయించి మళ్లీ జామ్‌గాంలోనే కొనసాగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పలు గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నవనీత్‌కుమార్, తహసీల్దార్ ఎం.సోము, ఎంపీవో మోహన్‌సింగ్, నాయకులు పి.గంగాధర్, రమేశ్, వి.మోహన్, శంకర్, రాథోడ్, బోయిడి విఠల్, గులాబ్, వి.నాగేశ్, దత్తాత్రి తదితరులు ఉన్నారు.


కుభీర్‌లో చెక్కు అందిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

కుభీర్: ఐటీడీఏ నిధులు రూ.4.50 కోట్లతో కుభీర్ నుంచి బెల్గాం వరకు చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడర్నా, కస్రా గ్రామాలకు రోడ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియ ముగిసిందని.. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్, నాయకులు వి.మోహన్, వడ్నం నాగేశ్, ప్యాట లక్ష్మణ్, పి.గంగాధర్, నాగేందర్, గులాబ్, మారుతి, బాలేరావ్ గంగాధర్, వైద్యనాథ్ తదితరులు ఉన్నారు.

అర్హులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఖానాపూర్: ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని అర్హులైన గ్రాడ్యుయేట్లు ఉపాధ్యాయ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. ఓటరు దరఖాస్తుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ఆధార్, ఓటరుకార్డు, పాస్‌ఫొటో, గెజిటెడ్ అధికారి సంతకంతో డిగ్రీ మెమో జిరాక్స్‌లతో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో అందించాలన్నారు. నవంబర్ 2021 కంటే ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.


కౌంటర్ వద్ద దరఖాస్తులు పరిశీలిస్తున్న సిబ్బంది

‘ఇందిరా మహిళా శక్తి’తో ఆర్థిక ప్రగతి

ఖానాపూర్: ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ప్రభుత్వం అందించే రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరా మహిళా శక్తి కింద ఏర్పాటు చేసిన బ్యూటీ పార్లర్‌ను ఆయన ప్రారంభించారు. అర్హులు వారు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయంఉపాధి పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అమానుల్లాఖాన్, సురేశ్, శంకర్, కమిషనర్ మనోహర్ తదితరులు ఉన్నారు.


బ్యూటీపార్లర్ ప్రారంభోత్సవంలో చైర్మన్, నేతలు

‘ఉపాధి’ గ్రామసభ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లిలో శనివారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ప్రియాంక అధ్యక్షతన 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులు గుర్తించి ప్రణాళికలు తయారు చేశారు. తమ గ్రామాభివృద్ధికి దోహదపడే పనులే చేపట్టాలని ఉపాధిహామీ సిబ్బందిని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, ఈజీఎస్ టీఏ భీమ్, ఎఫ్ఏ శ్రీనివాస్, గ్రామస్తులు రాజు, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో శనివారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేసే పనులు గుర్తించి కూలీల బడ్జెట్ అంచనాలను తయారు చేశారు. భూమిని చదును చేయుట, ఇంకుడుగుంతలు, చెరువులో పూడికతీత, రైతు చేలకు మట్టి రోడ్లు వేయడం, ట్రెంచ్, క్యాటిల్‌షెడ్లు, హార్టికల్చర్ తదితర పనుల కోసం బడ్జెట్‌లో రూ.కోటి 7 లక్షల 93 వేల ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ సతీశ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్, ఎఫ్ఏ విట్టల్, కూలీలు పాల్గొన్నారు.


పొట్టపెల్లిలో సభలో పాల్గొన్న గ్రామస్తులు

ఆశ్రమ పాఠశాల తనిఖీ

తానూరు: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను శనివారం ఎంపీడీవో అబ్దుల్ సమద్ తనిఖీ చేశారు. వంటగదులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని హాస్టల్ వార్డెన్ శ్రావణ్‌కు సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వారి వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో ప్రతిభ

లోకేశ్వరం: నిర్మల్‌లోని జేఎన్‌వీఆర్ పాఠశాలలో ఇటీవల విద్యాశాఖ నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో మండలంలోని మన్మద్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కబరిచారిని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మల్కాగౌడ్ తెలిపారు. పాటల విభాగంలో మణికంఠ, నృత్యంలో సంజన, వర్షిణి ప్రతిభ కనబర్చారు. శనివారం వారిని పాఠశాలలో సన్మానించారు.

సన్మానం

ఖానాపూర్: డీఎస్సీ-2024 ద్వారా ఎంపికై మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న నూతన ఉపాధ్యాయులను శనివారం వీడీసీ ఆధ్వర్యంలో సన్మానించారు. పాఠశాలల బలోపేతానికి సమష్టి సహకారం అవసరమని హెచ్‌ఎం నరేందర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ నాయకులు శంకర్, స్వామి, ఎర్రన్న, దయానంద్, లక్ష్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తానూరు తొలి ఎంపీపీ మృతి


జాదవ్ గంగాధర్ పటేల్ (ఫైల్)

తానూరు: మండలంలోని సింగన్‌గాం గ్రామానికి చెందిన జాదవ్ గంగాధర్ పటేల్ (80) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన 1986 లో తానూరు మండలానికి మొదటి ఎంపీపీగా పనిచేశారు. ఆదివారం సింగన్‌గాంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

కుంటాల: మండల కేంద్రంలోని రైతువేదికలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామారావు పటేల్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నూతన కార్యవర్గం

కుంటాల: మండలంలోని వెంకూర్ గ్రామంలో మాలల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాలల సంఘం గ్రామాధ్యక్షుడిగా బస్సుల కమలాకర్, ఉపాధ్యక్షుడిగా మగ్గిడి సురేశ్, కార్యదర్శిగా మంతెన సాయన్న, గౌరవ అధ్యక్షులుగా బాస గణేశ్, సాయి, కార్యదర్శిగా సుధాకర్ ఎన్నికయ్యారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన షేక్ అలీమా బేగంకు రూ.13వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు శనివారం గ్రామంలో వారి కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య, గుద్దేటి గంగాధర్, ప్యాట్ల రజినీకాంత్, సిందె దిగంబర్, సత్యాజి దత్తు, సూర్యవంశీ దిగంబర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శారదాదేవి నిమజ్జనం


శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు


నిమజ్జనానికి వెళ్తున్న ప్రతిమ

భైంసాటౌన్: పట్టణంలో శారదాదేవి విగ్రహాల నిమజ్జనం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచారు. ఈసందర్భంగా అమ్మవారి శోభాయాత్రలో పలువురు భక్తులు కోలాటం వేస్తూ నృత్యం చేశారు. అనంతరం విగ్రహాలను స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు తీసుకెళ్లి అమ్మవారికి హారతి, పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనం చేశారు.

‘బుద్ధవిహార్‌కు స్థలం కేటాయించాలి’

భైంసాటౌన్: ముధోల్ మండలం బోరిగాంలో సర్వే నం.249లో బుద్ధవిహార్ లుంబినీవనం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని దళిత సంఘాల నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామంలో వీడీసీ నిధులను స్వాధీనం చేసుకొని తెల్లకల్లు బట్టీ, బెల్టుషాప్‌లపై చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ అవినాష్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు విఠల్ కాంబ్లే, లక్ష్మణ్, భోజన్న, లక్ష్మణ్, దేవన్న, సాయన్న, బాబు, పోషన్న, ముత్తన్న, లింగం, దేవేందర్, నవీన్ తదితరులు ఉన్నారు.

మహిళలు స్వశక్తితో ముందుకుసాగాలి

ఖానాపూర్: ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో స్వశక్తి పట్టణ సమాఖ్య సాధారణ సమావేశానికి హాజరై మాట్లాడారు. అమానుల్లాఖాన్, జన్నారపు శంకర్, పరిమి సురేశ్, కిశోర్‌నాయక్, మెప్మా పీడీ సుభాశ్, కమిషనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

సత్యపాన సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న శ్రీ సీతారామాంజనేయ ఆలయ ఆవరణలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సత్యపాన సమావేశం నిర్వహించారు. వీహెచ్‌పీ నాయకులు గనపురం రాజేశ్వర్, శ్రీవాణి, ప్రణయ్, రాకేశ్, వెంకటేశ్, భూమేశ్, సురేశ్, ప్రభాకర్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడి పూజలు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు తీర్థ ప్రసాదం, ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం దేవరకోట దేవస్థానం చైర్మన్ కొండ శ్రీనివాస్ దంపతులు శ్రీహరి రావును శాలువాతో సన్మానించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఏఎంసీ చైర్మన్ సోమ భీంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిన్ను, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, నిర్మల్ మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, కొట్టే శేఖర్, గణేశ్ ఉన్నారు.


శ్రీహరిరావును సన్మానిస్తున్న సభ్యులు

క్లుప్తంగా

పాఠశాల సందర్శన


గణితం బోధిస్తున్న ఎంఈవో చంద్రకాంత్

లోకేశ్వరం: ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు మళ్లీ ఒకసారి ఇంటి వద్ద చదువుకోవాలని ఎంఈవో చంద్రకాంత్ అన్నారు. శనివారం మండలంలోని బిలోలి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవో సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు గణితం బోధించి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు సామ దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మెండె వెంకటరమణ, ధనుంజయ్ ఉన్నారు.

‘బ్యాంకు వివరాలు చెప్పొద్దు’

కుంటాల: రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని.. అపరిచితులు బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దని ఏఎస్సైలు దేవ్‌రావు, రాందాస్ సూచించారు. శనివారం మండలంలోని వెంకూరులో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. మోసాల బారిన పడితే తక్షణం 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండ


సాయం అందిస్తున్న యూత్ సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన జమదండి గంగాధర్ చిన్న కుమారుడు శ్రీకాంత్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. గ్రామంలోని హెల్పింగ్ యూత్ సభ్యులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారు పోగు చేసిన రూ.75,500ను గంగాధర్‌కు అందజేశారు. హెల్పింగ్ యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో కష్టాల్లో ఉన్నవారిని ఆదుకుంటామని పేర్కొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు పుష్పయాగం, నాగవెల్లి, ఉద్వాసన బలి, గ్రామ బలి, స్వామివారి హెచ్చరికలు, సప్తవర్ణ పూజ, ఏకాంతసేవ, పండితుల సన్మానం, మహాదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింహమూర్తి, కోటపెల్లి అనీశ్, నితీశ్ ఆచార్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సౌండ్‌సిస్టం విరాళం

కుభీర్: మండలంలోని పార్డి(బి) ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేసి ఇటీవల బదిలీపై కాశిరెడ్డి వెళ్లారు. తాను పని చేసిన పాఠశాలకు శనివారం రూ.18వేల విలువైన సౌండ్‌సిస్టంను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నారాయణ్‌రెడ్డి, సిబ్బంది.. కాశిరెడ్డి-శ్రీనివాస్‌రెడ్డి దంపతులను శాలువాతో సన్మానించి అభినందించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి


పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ

సారంగాపూర్: రైతులు తమ పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సారంగపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ అన్నారు. మండలకేంద్రంలోని సోయా కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఏఓ వికార్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. వారి వెంట మార్కెట్ కార్యదర్శి దూమ్మా నాయక్, డైరెక్టర్లు, రైతులు తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విజన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి అనురాధ మాట్లాడుతూ బాల్య వివాహాలు, ప్రభావాలు, నియంత్రణ, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 తదితర అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.